

# మాగాడు

## - అత్తలూరి విజయలక్ష్మి



*(గత సంచిక తరువాయి)*

16వ భాగం

**ఆహ్లాదకి అరచేతుల్లో** చెమటలు పట్టసాగాయి.. ఇప్పుడేనా ! ఇప్పుడేనా ! అమ్మని కలిసింది.. ఇప్పుడేనా ! ఇక్కడి నుంచి అమ్మ కథ మొదలై ఉంటుందా! ఆమె గుండెలు ఎప్పటికన్నా వేగంగా కొట్టుకోసాగాయి. తల్లి డైరీ లో ప్రతి అక్షరం ఆమె కళ్ళ ముందు చక,చకా జరిగిపోతున్నాయి. తేజ చెప్పబోయే తరవాతి కథ వినడానికి, విని తట్టుకోడానికి తనని తాను సమాయత్తం చేసుకోసాగింది.

తేజ స్వరం మోగింది.. కానీ ఇంతవరకు వినిపించిన గాంభీర్యం ఆ స్వరంలో లోపించినట్టు అనిపిస్తోంది.. కొంచెం నీరసంగా, వేదనగా ఉంది..

"ఆయనమాట ఇచ్చిన ప్రకారం నా పేరు మీద ఎకౌంటు ఓపెన్ చేసి నా ముప్పై వేలుతో పాటు మరికొంత కలిపి లక్ష రూపాయలు వేసారు. చేతి ఖర్చులకి కొంత ఇచ్చారు. అంత డబ్బు తీసుకుంటుంటే ఏదో తప్పు చేస్తున్న భావన నాలో..

" ఒద్దండి.. ఇంత డబ్బు నాకెందుకు" అన్నా వినిపించుకోలేదు.

"నీకు నేను చాలా బాకీ ఉన్నానురా.. ఇలా తీర్చుకోనీ " అన్నారు.

"ఇక నుంచీ నీకు నువ్వే గైడ్.. నీకు నువ్వే గురువు.. నీకు నువ్వే ఆలంబన.. ఇప్పటి నుంచీ నువ్వు సర్వ స్వతంత్రుడివి.." భుజం తట్టారు.

ఆ మాటలు నా రక్తంలో కొత్త ఉత్తేజాన్ని నింపాయి. నేనిప్పుడు మనిషిని అనుకున్నా.. అవును మనిషిని... మగాడిని. నా పేరు " మాగాడు" కాదు. . 'మగాడు'. ఎంత తేడా ఈ రెంటికీ ! అప్పటినుంచీ తరచూ అలాగే అనిపిస్తూ ఉండేది. అలా అనుకున్నప్పుడల్లా నా హృదయపుపొరల్లో నిద్రపోతున్న మాగాడు చటుక్కునలేచి నాలో అలజడి కలిగిస్తూ ఉండేవాడు. మహా వాడిని అణచి ఒళ్ళు విరుచుకుంటాడు. అలాంటప్పుడుమాగాడిని భూస్థాపితం చేయాలనుకునే వాడిని

.. నేటికీ నాలో ఆ మాగాడు నిద్ర లేస్తూనే ఉంటాడు.. ఈజిప్షియన్ మమ్మీలాయుగ,యుగాలు నాతోటే ఉంటాడు కాబోలు అనుకుంటాను.

"మొదటిసారి రైలు ప్రయాణం... నాతోపాటు ఎందఱో ప్రయాణిస్తున్నారు. వారంతా నాకు తెలిసిన వాళ్ళు కాదు.. కానీ పలకరించారు.. "ఎక్కడికి వెళ్తున్నావు బాబూ! అలాగా! ఎవరున్నారు అక్కడ? ఏం చదువుకుంటున్నావు? " ముఖ్యంగా ఆ కంపార్ట్మెంట్ లో ఉన్న పదిమంది లో ఆ ప్రశ్న ముగ్గురు వేయడంతో మొదటిసారిగా నేను నిరక్షరాస్యుడిని అనే వాస్తవం తెలుసుకున్నట్టు అయి, క్రుంగిపోయాను. నేనేమి చదువుకోలేదన్న భావన చేదుగా అనిపించింది. ఏమి చదువుకోడం లేదు అని చెప్పడానికి సిగ్గుగా అనిపించింది. నేను గొప్ప చిత్రకారుడిని అని చెప్పాలని గొంతుదాకా వచ్చిన మాటలు గొంతులోనే ఆగిపోయాయి. చదువుకి ఇంత ప్రాధాన్యత ఉందా! అనిపించింది. "నీలో ఎంత గొప్ప కళ ఉన్నా కనీసం ప్రాధమిక విద్య అయినా లేకపోతే ఆ కళకి విలువ ఉండదు మహా! కనీసం ప్రైవేట్ గా చదువుకుని ఒక డిగ్రీ సంపాదించు" చంద్రకాంత గారు తరచూ చెప్పేమాట పదే పదే గుర్తుకు రాసాగింది.

చదువు విలువ తెలియక చదువు నిర్లక్ష్యం చేశాను . ఇప్పుడిలా నాకు కొత్త అయిన ఆ చిన్న ప్రపంచంలో యాభై శాతం మంది చదువుకున్నావా! లేదా అని నిలదీస్తున్నాట్టు అనిపించి, ఎప్పటికైనా ఎలాగైనా చదువుకోవాలి అని మనసులోనే నిశ్చయించుకున్నాడు.

రైలుతో పాటు కదులుతున్న చెట్లనీ, పొదలనీ, చూస్తూ రేపటి నుంచీ నేనెవరు అనే ప్రశ్నకి సమాధానం అన్వేషిస్తూ గడిపాను .

రైలు గమ్యం చేరింది. సీటు కింద నుంచి సూట్కేసు తీసుకుని రైలు దిగాను.. ప్లాట్ ఫారం దాటి అందరితో పాటు నడిచి స్టేషన్ బయటకి వచ్చాను. .

" మీతో ఎవరూ రాలేదా.. ఒక్కరే వెళ్ళారా! హైదరాబాద్ కి వెళ్ళారా! బెంగుళూరు వెళ్ళారా!" అక్కడే కొంచెం దూరంలో కూర్చుని వింటున్న ఆహ్లాద ఆదుర్దాగా అడిగింది.

అతను ఆమె వైపు విచిత్రంగా చూసాడు. " నేను బెంగుళూరు వెళ్లానని ఎవరు చెప్పారు?"

"పాజ్ " అంది మేఘన..

"అది.. అది.". ఆహ్లాద తడబడుతూ అందరి వైపు తలతిప్పి చూసి.. " ఊరికే.. just " అంది..

అతను ఆహ్లాద వైపే విస్మయంగా చూస్తూ ఉండిపోడం గమనించిన మేఘన అంది.. " మీరు లాంజ్ లో కూర్చుని లైవ్ చూడండి మేడం ప్లీజ్..."

ఆహ్లాద "సారీ " అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. " సర్.. కంటిన్యూ చేస్తారా !" కొంచెం ఒంగి తేజ మొహం లోకి చూస్తూ అంది మేఘన.

అతను కొన్ని క్షణాలు మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

కెమెరా అతని వైపు పొజిషన్ చూసుకున్నాడు కెమెరా మాన్.. మేఘన తేజ వైపు ఆదుర్దాగా చూడసాగింది.

కొన్ని క్షణాల తరవాత అతను తమాయించుకుని నెమ్మదిగా చెప్పసాగాడు.

"ఆయన నన్ను రైలు ఎక్కించారు.. లక్ష్మి దేవి గారు కూడా వచ్చి నన్ను దీవించి వీడ్కోలు చెప్పారు.. ఆ తరవాతా..." అతను ఉన్నట్టుండి కుర్చీలో వెనక్కి వాలాడు.. మేఘన గబుక్కున కుర్చీలో నుంచి లేచింది.. లైట్స్ ఆఫ్ అయిపోయాయి. అక్కడే ఉన్న కెమెరా మాన్ తో పాటు అతని అసిస్టెంట్ కూడా కంగారుగా తేజ కుర్చీ దగ్గరకు వచ్చారు.

"సర్ ఆర్ యు ఆల్ రైట్ " మేఘన అతని భుజం మీద చేయి వేసి అడిగింది..

"వా... వాటర్ " అన్నాడు కుడిచేయి బొటనవేలు చూపిస్తూ..

క్షణాల్లో అతని చేతికి వాటర్ బాటిల్ అందించాడు అసిస్టెంట్.

బాటిల్ ఎత్తి గొంతులో పోసుకుంటూ ఉండగా నోట్లో పడలేదు.. జారి షర్టు కాలర్ తడిపేసింది.

మేఘన తనే బాటిల్ అందుకుని జాగ్రత్తగా అతని నోట్లో పోసింది.

అద్దంలో నుంచి ఇదంతా గమనిస్తున్న ఆహ్లాద పరుగున డోర్ తీసుకుని వచ్చి " ఏమైంది" అంది.

"తెలియదు.. డ్రైవర్ ని పిలవండి.. డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్దాము.." అంటూనే మేఘన మరోసారి తేజాగారూ అని పిలిచింది.. అతను పలకలేదు.. చూస్తూ ఉండగానే అతని కళ్ళు మూతలు పడ్డాయి.. పెదవులు అస్పష్టంగా ఏదో గొణుగుతున్నట్టు కదలసాగాయి.

అప్పటివరకు ఏదో లోకంలో ఉన్నట్టున్న వారంతా అలర్ట్ అయారు.. డ్రైవర్ సహాయంతో తేజాని కారులో ఎక్కించారు. మేఘన, ఆహ్లాద చెరో పక్క కూర్చున్నారు. కారు హాస్పిటల్ వైపు కదిలింది.

నగరంలోని అత్యంత ఖరీదైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్..

కారు ఆగడం, స్ట్రెచర్ తో హాస్పిటల్ స్టాఫ్ సిద్ధంగా ఉండి, తేజాని క్షణాల్లో ICU వైపు తీసుకుని వెళ్ళడం జరిగింది. మేఘన, ఆహ్లాద తేజతో సహా కారెక్కగానే వర్మ ఆ హాస్పిటల్ చీఫ్ తో మాట్లాడాడు. తేజ సంగతి చెప్పాడు.. చీఫ్ వెంటనే స్పందించి చక,చకా ఏర్పాట్లు చేసాడు.

ICU బయట ఆహ్లాద, మేఘన బిక్క మొహాలు వేసుకుని కూర్చున్నారు.

తెల్లని గోడలు , నీడలు తేలుతున్న ఫ్లోరింగ్, విశాలమైన కారిడార్, ఇత్తడి కుండీల్లో ఇంటీరియర్ ప్లాంట్స్.. తెల్లని దుస్తులు, మేడలో స్టెతస్కోప్ తో దేవదూతల్లా కదులుతున్న డాక్టర్స్, సేవే జీవిత పరమావధి అన్నట్టు ప్రశాంతమైన వదనాలతో చేతిలో కేసు షీట్స్ తో సిస్టర్స్, మధ్య, మధ్య ఆకుపచ్చ బెడ్ షీట్ లాంటిది పరచి ఉన్న స్ట్రెచర్స్ లాగుతూ హడావుడిగా తిరిగే వార్డ్ బాయ్స్...

అదంతా ఎన్నడూ చూడని ఓ అధ్బుత ప్రపంచంలా ఉంది కానీ హాస్పిటల్ లాగా లేదు. భవిష్యత్తులో ఇలాంటి ఒక హాస్పిటల్ లో పని చేసే అవకాశం రావచ్చో, లేదో తెలియదు.. ఇప్పుడు మాత్రం భయంతో ఒళ్ళంతా చెమటలు పడుతున్నా, సెంట్రలైజేడ్ ఏ సి తాలూకు చల్లదనం కొంత ఉపశమనం కలిగిస్తున్నది. కాకపోతే హటాత్తుగా తేజ అలా పడిపోవడమే జీర్ణించుకు పోలేకపోతోంది ఆహ్లాద. అసలు ఆయనకీ ఏం జరిగిందో తెలుసుకుందామంటే ఒక్క డాక్టర్ కూడా లోపల నుంచి బయటకు రావడం లేదు.. వాళ్ళని లోపలికి రానివ్వడం లేదు. అప్పటివరకు బాగానే ఉన్న తేజ ఎందుకలా కూర్చున్న కుర్చీలో విరుచుకు పడ్డాడో, అక్కడ కూర్చున్న ఆ ఇద్దరు అమ్మాయిలకు అర్థం కావడం లేదు. ఆయనకి ఏమైందో ఇద్దరి మనస్సులో దిగులు.. ఆందోళన..

ఆయన.. ఆయనకీ ఏమన్నా అయితే,, అమ్మ కోరిక తను నెరవేర్చలేదు.. అమ్మ ఎన్నటికీ తనని క్షమించదు . ఆయనలా సడన్ గా సిక్ అవడానికి కారణం ఏమిటి? అమ్మ గుర్తోచ్చి ఉంటుందా ! ఎమోషనల్ అయారా ! తనేదన్నా బాధ పెట్టి ఉండచ్చా.. ఏం జరిగి ఉంటుంది! దేవుడా! తేజ గారిని కాపాడు. ఆయన చెప్పబోయే మిగిలిన ఆయన జీవిత కథలో అమ్మ చాలా ప్రధాన పాత్ర.. ఆ పాత్ర వలన ఆయన జీవితంలో వచ్చిన అనూహ్యమైన మార్పు అందరికీ తెలియాలి. ఆయన ఆరాధ్య దేవత కూతురు నేను అని ఆయనకీ తెలియాలి.. ఆహ్లాద దేవుడిని ప్రార్ధిస్తూ రెండు చేతులు నలుపుకుంటూ కనురెప్పలు, మూస్తూ, తెరుస్తూ టెన్షన్ గా కూర్చుంటే, “ భగవాన్ తేజగారి డాక్యుమెంటరీ పూర్తీ కాకుండా ఇంత ప్రమాదం జరుగుతుందని నేను ఊహించలేదు.. అయినా, నేనేమి ఆయనని ఇబ్బంది పెట్టె ప్రశ్న అడగలేదే.. ఎందుకలా సడన్ గా షాక్ తగిలినట్టు విరుచుకుపడ్డారు. ఆయనకీ ఏదన్నా అయితే మొత్త భారతదేశంలోని ఆయన అభిమానులంతా తనని తరిమి, తరిమి కొడతారు.. ఇప్పుడెలా? ఆయనని కాపాడు తండ్రీ... అంటూ ఇద్దరూ వారి,

వారి ఆలోచనలలో తేజ క్షేమాన్ని కోరుకుంటూ కూర్చున్నారు. సిస్టర్ డోర్ తీసుకుని బయటకి వచ్చింది.. ఇద్దరూ గబుక్కున లేచారు.

మీరు ఆయనకీ ఏమవుతారు? ఇద్దరి వైపు చూస్తూ అడిగింది. ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"ఆయనకి insurance ఉందా !" అడిగింది సిస్టర్..

ఇద్దరూ ఒకరినొకరు ప్రశ్నార్ధకంగా చూసుకోడం తప్ప సమాధానం ఇద్దరి వద్దా లేదు..

సిస్టర్ కొంచెం అసహనంగా అంది.. "ఆయన ఏదన్నా మెడికల్ insurance తీసుకున్నారా ! ఆయనకీ heart attack వచ్చింది.. చాలా టెస్ట్ లు, ఆంజియో గ్రామ చేయాలి.. వాళ్ళ వాళ్ళు ఎవరన్నా ఉన్నారా!"

"ఆయన great ఆర్టిస్ట్ " గబుక్కున అంది ఆహ్లాద.

సిస్టర్ సీరియస్ గా చూసింది.. "అది ఫ్రీ మేడికేషన్ కి అర్హత నిర్ణయించే సర్టిఫికేట్ కాదు కదా ! హాస్పిటల్ ఫార్మాలిటీస్ కొన్ని ఉంటాయి.. వివరాలు ఏమి తెలుసుకోకుండా ట్రీట్మెంట్ చేయడం రిస్క్.. కానీ చీఫ్ చెప్పారని చేస్తున్నారు.. బేసిక్ ఫార్మాలిటీస్ మస్ట్ ఫాలో .."

మేఘన అందుకుని గబా,గబా అంది " సిస్టర్ ! మా చానల్ లో ఇంటర్వ్యూ చేస్తుంటే ఇలా జరిగింది.. నేను మా హెడ్ తో మాట్లాడతాను.. మీరు చేయాల్సింది చేయండి.. ఆయనకి ప్రమాదం ఏమి లేదుకదా!"

ఆ ఇద్దరు అమ్మాయిల మొహాల్లో కనిపిస్తున్న ఆదుర్దా, దుఃఖం చూసి సన్నగా నిట్టూర్చింది సిస్టర్. వీళ్ళిద్దరూ ఆర్టిస్ట్ లు అయి ఉంటారు.. ఎంత గొప్ప వాళ్ళు అయినా కొన్ని లాంఛనాలు తప్పనిసరి.. రూల్స్ మారవు అని వీళ్ళకు చెప్పాలా! కాకపోతే వాళ్ళ టెన్షన్ వాళ్ళది.. అయినా తనలాంటి వాళ్లకి సెలబ్రిటీ లు ఎవరు, సామాన్యులు ఎవరు తెలిసే అవకాశం ఏది? ఇరవై నాలుగు గంటలు రోగుల సేవ తప్ప ఇంకో వ్యాపకము లేదు,, మరోధ్యాస లేదు.. సమయం దొరికితే విశ్రాంతికి మొహం వాచినట్టు పడుకోడం తప్ప టి వి కూడా చూసే అవకాశం లేదు.. కొంచెం ప్రశాంతంగా అంది .." సరే! డాక్టర్ గారు వస్తారు.. వారితో మాట్లాడండి." అంటూనే గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. అద్దం దగ్గరగా మొహం పెట్టి చూస్తున్న మేఘన కి ఆమె లోపల డాక్టర్ తో మాట్లాడడం కనిపించింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS